
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 నవంబర్ 2022
5
తిరుపతి



రికార్డుల నిర్వహణ తప్పనిసరి : ఆర్‌టిఐ కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



ప్రభుత్వ కార్యాలయాలలో రికార్డు మేనేజ్ మెంట్ సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే పౌరులు కోరిన సమాచారం అందించగలుగుతామని సమాచార కమీషనర్ ఉల్చాల హరిప్రసాద్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో సమాచార హక్కు చట్టం క్యాంప్ కోర్టు రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ వివరిస్తూ మొదటి రోజు నిర్వహించిన 28 కేసులకు గాను 21 ఉత్తర్వులను ఇవ్వడం, మరో మూడు విచారణకు ఆదేశించడం జరిగిందని, మిగిలిన కేసులకు సంబంధించి వాయిదా ఇవ్వడమైనదని తెలిపారు. నేడు 14 కేసులకు సంబంధించి క్యాంప్ కోర్టు నిర్వహణ ఉంటుందని తెలిపారు. కేసుల్లో అధిక శాతం రెవిన్యూ విభాగానికి చెందినవన్నారు.





గూడూరు రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్...
నిరుపయోగం..!

'సూచిక బోర్డు' లేక ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - గూడూరు

ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని, గూడూరు జంక్షన్‌లోని రైల్వేస్టేషన్‌లో రెండో టికెట్ బుకింగ్ కౌంటర్'ను ఏర్పాటు చేశారు.. అయితే ప్రయాణికులకు కనిపించేలా 'సూచికబోర్డు' లేకపోవడంతో చాలా మందికి తెలియక తికమకపడే పరిస్థితి నెలకొంది. రైల్వే అధికారుల ఆశయం ఎలా ఉన్నా, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఈ బుకింగ్ కౌంటర్ నిరుపయోగంగా పడి ఉంది. ఎపుడూ మూసి ఉండటం కూడా విమర్శలకు తావిస్తోంది.

గూడూరు రెండో పట్టణ పరిధిలోని ప్రజల ప్రయోజనార్ధమే కాకుండా వెంకటగిరి, చెన్నూరు, రాపూరు వైపు నుండి వచ్చే ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా రెండో టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. గూడూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణలో భాగంగా 4, 5 నంబర్ల ప్లాట్‌ఫారంతో పాటు నూతనంగా ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణానికి వెళ్లేందుకు అందుబాటులో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. అందుకు అనుగుణంగా టికెట్ బుకింగ్‌కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. రెండో పట్టణ ప్రజలు ఒకటో కౌంటర్ వద్దకు వచ్చి టికెట్ కొని రైలు ఎక్కే సమయానికి రైలు వెళ్లిపోయి చాలా మంది ప్రయాణికులు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆ ఇబ్బందులను తొలగించేందుకు రెండో పట్టణ ప్రజల ప్రయోజనమే కాకుండా, అటువైపు వచ్చి దగ్గరగా టికెట్ కొనుక్కునే సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన కౌంటర్ అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యిందని చెప్పవచ్చు. బుకింగ్ కౌంటర్ రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు దూరంగా ఉండటమే కాకుండా, ప్రయాణికులు లేరనే కారణంతో ఎపుడూ మూసి వుండటం వల్ల నిరుపయోగంగా మారిపోయింది. ఇకనైనా బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని సాధించేలా రోడ్డుపై నుంచి బ్రిడ్జి ప్రవేశానికి వచ్చే మార్గంలో బుకింగ్ కౌంటర్ ఉన్నట్లు ఓ సూచిక బోర్డును ఏర్పాటు చేసి టికెట్లు విక్రయిస్తే ప్రయాణికులకు సులువవుతుంది. లక్ష్యం నెరవేరుతుంది.

నేడు బ్యాంకులు బంద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అందుకు నిరసనగా శనివారం బ్యాంకులు బంద్ చేస్తున్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆల్ ఇండియా బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఏఐబిఈఏ పిలుపు మేరకు స్థానిక టిపి ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎదుట తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటి ప్రధాన కార్యదర్శి జె.భవ్వంత కుమార్, అధ్యక్షులు పి. విజయభాస్కర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బ్యాంకు ఉద్యోగుల మీద యాజమాన్యం దాడులు పెరిగాయని, ఉద్యోగుల బదిలీ ద్వైపాక్షిక వ్యతిరేకంగా జరుగుతున్నదని తెలిపారు. కార్మిక చట్టాలలో మార్పుల పేరుతో యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు . కొన్ని బ్యాంకుల్లో నగదు లావాదేవీలను ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించి ఖాతాదారుల ఖాతాలకు భద్రత లేకుండా పోతుందని తెలిపారు. ఇటీవల కాలంలో ఒక బ్యాంకులో 3000 మంది ఉద్యోగులను సెటిల్మెంటుకు విరుద్ధంగా బదిలీలు చేసారని తెలిపారు. బ్యాంకులలో కొత్త నియామకాలు చేయడం లేదని, అందువలన ఉన్న సిబ్బందికి పని ఒత్తిడి పెరిగి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. కావున ఈ నెల 19 వ తేది దేశ వ్యాప్తంగా ఉద్యోగులు ఒక రోజు సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జనార్ధన్, భాస్కర్, మజేష్ బాబు, పవన్, నందగోపాల్, లక్ష్మీపతి, నిర్మలాదేవి, సమంత, రేష్మి, శ్రీనివాసన్, కేశవరెడ్డి పాల్గొన్నారు.





తనుష్క్ జ్యువెలరీ షోరూం పునఃప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

ప్రకాశం రోడ్డులో అదనపు ఫ్లోర్‌తో నిర్మితమైన తనుష్క్ జ్యువెలరీ షోరూం పున్ణ ప్రారంభం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తనుష్ జ్యువలరీ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా టైటాన్ కంపెనీ సంస్థ సౌత్ రీజనల్ బిజినెస్ హెడ్ శరద్ ఆర్ మాట్లాడుతూ షోరూంలో బంగారు, వజ్రాభరణాలు సరికొత్త డిజైన్లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతి కొనుగోలుపై ఉచిత బంగారు నాణేలను అందించడం. జరుగుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈనెల 19వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణా అర్బీఎం హెడ్ శ్రీకష్ణ, బిజినెస్ పార్టనర్ త్యాగరాజన్ పాల్గొన్నారు.

'ప్రైవేటు' రాకెట్ ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీహరికోటలోని సౌండింగ్ రాకెట్ లాంచింగ్ కాంప్లెక్స్ నుండి శుక్రవారం ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ప్రయోగించిన మిషన్ 'ప్రారంభ' ప్రైవేటు రాకెట్ ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. హైదరాబాద్‌కు చెందిన స్కై రూట్ ఏరో స్పేస్ సంస్థ తయారు చేసిన 'విక్రమ్-ఎస్'కు 'మిషన్ ప్రారంభ'గా నామకరణం చేశారు. భారత్ నుండి ప్రైవేటు సంస్థ తయారు చేసిన మొదటి రాకెట్ ప్రయోగం ఇదే కావడంతో ఈ ప్రయోగానికి ప్రత్యేకత సంతరించుకుంది.కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ ఈ ప్రయోగాన్ని షార్ నుండి ప్రత్యక్షంగా చూశారు. స్కై రూట్ సంస్థ ముందుగా నిర్దేశించిన ప్రకారమే ఈ ప్రయోగం జరగడం స్కై రూట్ సంస్థ ఉద్యోగుల్లో ఆనందోత్సహాలు నింపింది.

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైతు భరోసా కేంద్రాలు రైతులకు అండగా ఉంటాయని, వరి కోతలు ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని జేసీ డికె బాలాజీ అన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సమావేశం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన జరిగింది. డిఆర్‌ఓ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు అమ్మడానికి వీల్లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారానే చేపట్టాలని నిర్ణయించామన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకర్లు రైతులకు సకాలంలో రుణాలు అందించాలని, పంట రుణాలతో పాటు వ్యవసాయ యంత్రాలు, పరికరాల కొనుగోలుకు, సబ్సిడీ పథకాలకు పూర్తి సహకారం అందించాలన్నారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ ప్రధానంగా చేపల ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌లో మన జిల్లాలో అధికంగా ఉందని, వినియోగం మూడు శాతం మాత్రమే ఉందన్నారు. ఫిష్ ఆంధ్ర ప్రాజెక్టు కింద ప్రాణి చేపల అమ్మకాలు పెంచాలని, ఔట్‌లెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న 60 శాతం రాయితీ ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సోలార్ కోల్డ్ రూమ్స్ ఏర్పాటుకు, సిహెచ్‌సిల ఏర్పాటుకు రాయితీలు ఇస్తోందన్నారు. ఈ సమీక్షలో ఎల్‌డిఎం శుభాష్, జిల్లా హార్టికల్చర్ అధికారి దశరథరామిరెడ్డి, సెరికల్చర్ అధికారి గీతారాణి, డిఎం సివిల్ సప్లై సుమతి పాల్గొన్నారు.

పరిశ్రమలకు 10.89 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



జిల్లాలో నాలుగు కొత్త పరిశ్రమలకు 10.89 ఎకరాలను ఎపిఐఐసి కేటాయించిందని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. 32 పరిశ్రమలకు పరిశీలన కమిటి సూచించిన మేరకు రూ.1.47 కోట్లను మంజూరు చేశామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటి సమావేశం డిఆర్‌ఓ అధ్యక్షతన జరిగింది. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి సమావేశపు అజెండాను కమిటీ ముందుంచారు. డిఆర్‌ఓ మాట్లాడుతూ సింగల్ డెస్క్ పోర్టల్‌లో 336 పరిశ్రమల నిర్మాణాలకు అనుమతులు పొందారని, మరో 20 దరఖాస్తులను ఆలస్యం లేకుండా సంబంధిత శాఖలు ఉమ్మడి తనిఖీలు నిర్వహించి పరిష్కరించాలని సూచించారు. ఎస్‌విఆర్, ఎకోజోన్ ప్రైవేట్ వారికి వేలంపాడు ఇండస్ట్రియల్ పార్కునందు రెండు ఎకరాలు, సెంచరి అడెసివ్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ వారికి అక్కంపేట ఇండస్ట్రియల్ పార్కులో 3.32 ఎకరాలు, కోస్టల్ డ్రగ్స్ వారికి అత్తివరం ఇండస్ట్రియల్ పార్కులో 1.01 ఎకరాను కేటాయించినట్లు తెలిపారు. 32 పరిశ్రమలకు కోటి 46 లక్షల 73వేల రూపాయలను పర్యవేక్షణ కమిటీ సూచనల మేరకు రాయితీలను మంజూరు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎపిఐఐసిసి జోనల్ మేనేజర్లు సుహానా సోని, చంద్రశేఖర్, ఎల్‌డిఎం శుభాష్, తుడ సెక్రటరీ లక్ష్మి, అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

బ్యాంకర్స్ చేయూతతోనే అభివృద్ధి సాధ్యం: మేయర్ శిరీష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



బ్యాంకర్స్ చేయితతోనే అభివద్ధి సాధ్యమవుతుందని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్. శిరీష పేర్కొన్నారు. తిరుపతి నగర పరిధిలోని అన్నమయ్య కూడలి వద్ద ఆధునికరించిన బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండవ బ్రాంచ్ ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు తగిన ప్రాధాన్యతనిస్తూ లబ్ధిదారులకు అందిస్తున్నారని, సమిష్టిగా పని చేస్తే మంచి అభివద్ధి సాధించడం జరుగుతుందనడానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా దినదినాభివద్ధి తార్కాణం అన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ సోమశేఖర్ మాట్లాడుతూ తమ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ బ్యాంకు ఉన్నతికి ఎంతగానో ఉపయోగపడుతున్నారని, సామాన్య మధ్య తరగతి ప్రజల ఆర్థిక చైతన్యం కల్పించేలా ముద్ర, డైరీ, స్టార్టప్, ప్రొఫెషనల్, విద్య ఋణాలు ఇలా అనేక రకాలైన ఋణాలను తమ బ్యాంకు ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్ ఢిల్లీబాబు, ఎలైట్ హాస్పిటల్ అధినేత బాలసుబ్రమణ్యం, ఏఎంఓ సీతారాం, సీనియర్ బ్రాండ్స్ మేనేజర్ మధుసూదన్, కేటి రోడ్ బ్రాంచ్ మేనేజర్ మహేష్, చంద్రగిరి బ్రాంచ్ మేనేజర్ దుర్గా కిరణ్, అడ్మిన్ ఆఫీసర్ ఎ. ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు ఖైదీలకు హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



గ్రాసం సంస్థ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి కోర్టు ఆవరణలోని సబ్‌జైలు ఖైదీలకు 'హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ, టీబీవ్యాధి'పై అవగాహన కల్పించినట్లు గ్రాసం సంస్థ మేనేజర్ ఎన్.దొరస్వామి తెలిపారు. జిల్లా టీబీ వ్యాధి నియంత్రణ ల్యాబ్ సూపర్‌వైజర్ ఎస్.మొహియుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీబీ స్వీయ పరీక్షలు, పోస్టర్లు, కరపత్రాలు అందజేశారు. కళాజాతా ద్వారా అవగాహన కల్పించారు. జైలు సూపరింటెండెంట్ గుణశేఖర్‌రెడ్డి, కళాజాతా బృందం అధ్యక్షులు రెడ్డెప్ప, గ్రాసం సంస్థ టీం కౌన్సిలర్ పార్వతి, రాజు, అరుణ, ప్రియదర్శిని పాల్గొన్నారు.

గుర్తింపులేని కళాశాలలను రద్దు చేయాలి

తిరుపతి సిటీ : నగరంలో గుర్తింపు లేకుండా నడుస్తున్న జూనియర్ కళాశాలలను రద్దు చేయాలని ఎపి స్టూడెంట్స్ జెఎసి ఆధ్వర్యంలో భారతీయ దళితసేవ, ఎన్ఎస్‌యుఐ, గిరిజన జన సమాజ్, బహుజన విద్యార్థి సమైక్య సంఘాలను కలుపుకుని ఆర్ఐఒ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎపి స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఒక్కో విద్యార్థి నుంచి లక్షా 50వేలు ఫీజు వసూలు చేస్తున్నాయన్నారు. అపార్టుమెంట్లలో కళాశాలలను నడపడం సమంజసం కాదన్నారు. మహేంద్రనాయక్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉన్నత విద్య అవకాశాలపై సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

హైదరాబాద్ కు చెందిన 'ఏస్' ఇంజనీరింగ్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు ఉన్నత విద్య అవకాశాలు, ఉపయోగాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఏస్ అకాడమీ ప్రతినిధి త్రినాథ్ అవగాహన సదస్సులో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అవకాశాలను అందుపుచ్చుకోవాలంటే మన దేశంలో అందుబాటులో ఉన్న పేరుగాంచిన విశ్వవిద్యాలయాలు, అందులో విద్యా అవకాశాలు పొందడానికి నిర్వహించే రాత పరీక్షలకు విద్యార్థులు ఏ విధమైన తర్ఫీదును పొందాలో వంటి వాటి గురించి మెలుకువలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు కార్తీకమాస వన మహోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 20న కార్తీక సంధ్య అకాడమీ ఆధ్వర్యంలో చంద్రగిరి సమీపంలోని ముక్కోటి దగ్గరున్న నారాయణి గార్డెన్స్ లో కార్తీక మాస వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అకాడమీ గౌరవ అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు, వన విందు భోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిటిడి పాలక మండల సభ్యులు ముద్రంశెట్టి రాములు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్కీడిప్ తీస్తున్నామని, అందులో విజేతలుగా నిలిచిన ఇద్దరికి అన్నవరం వెళ్లి రావడానికి, బస, దర్శన ఏర్పాట్లు అన్ని అకాడమీ ఆధ్వర్యంలో చేస్తామన్నారు. అధ్యక్షులు కొండపల్లి సురేష్, మాజీ అధ్యక్షులు దేవరశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి సూరే శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'క్రెస్ట్'ఫౌండేషన్‌తో మహిళా వర్సిటీ ఒప్పందం



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం క్లైమేట్ ఆక్షన్ అకాడమీ ఆఫ్ క్రెస్ట్ ఫౌండేషన్ , హైదరాబాద్ తో అవగాహన ఒప్పందం (ఎం వో యూ) చేసుకుంది. ఈ మేరకు ఎస్.పి.ఎం.వి.వి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లో రెండు సంస్థల ప్రతినిధులు సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున మాట్లాడుతూ ఎం.వో.యు యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఒకరికొకరు పరస్పర సహకారం అందించుకోవడం, సర్టిఫికెట్ కోర్స్ ఆఫర్ చేయటం, విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్ ఇవ్వడం, వాతావరణ మార్పుల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేయటం, సెమినార్లు వర్క్‌షాపులు నిర్వహించడం. యుఎన్‌ఓ వారి ఎస్.డి.జి లను గ్రామాలను దత్తత తీసుకొని, ఈ ఎస్.డి.జి లను ఆచరణ లోకి తీసుకుని రావటం, పుడమి మాతను కాపాడే దానికి సంయుక్త కార్యాచరణ వంటి కార్యక్రమాలు చేయటం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లైమేట్ ఆక్షన్ అకాడమీ ఆఫ్ క్రెస్ట్ ఫౌండేషన్ హెడ్ ఎం. ఇందిర దాస్ పాల్గొన్నారు.

రహదారులపై పచ్చదనం పెంపొందిద్దాం : కమిషనర్

తిరుపతి టౌన్ : నగరంలోని ప్రధాన రహదారుల మధ్యలో, అదేవిధంగా ముఖ్య కూడళ్లలో పచ్చదనం పెంచేందుకు సరైన చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని డిబిఆర్ ఆస్పత్రి రోడ్డు, వైఎస్ఆర్ మార్గ్, అన్నమయ్యమార్గ్, లక్ష్మీపురం సర్కిల్, అన్నమయ్య సర్కిల్, మహిళా యూనివర్సిటీ సర్కిల్ ప్రాంతాల్లో కమిషనర్ పరిశీలించారు. ఎపుడూ గ్రీనరీతో చూసేవారికి అందంగా ఉండేలా మొక్కలను పెంచాలన్నారు. కొన్నిచోట్ల మొక్కలు ఎండిన స్థితిలో ఉండటాన్ని గమనించి అధికారులను, కాంట్రాక్టర్‌ను మందలిస్తూ నిత్య పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, దేవిక పాల్గొన్నారు.

మాస్టర్‌రోడ్లు పూర్తి చేయడం అత్యవసరం

నగరంలో ప్రతిపాదించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు, ఏరియా డెవలప్‌మెంట్ రోడ్లు పూర్తి చేయడం అత్యవసరమని కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అన్నారు. రోడ్ల స్థితిగతులపై శుక్రవారం ప్లానింగ్ అధికారులు, సెక్రటరీలతో సమావేశమయ్యారు. 13 మాస్టర్‌ప్లాన్ రోడ్లను పూర్తిచేసే ప్రక్రియలో ఏవైనా ఆటంకాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. అదనపు కమిషనర్ తంబల సునీత, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.





ఎపిఎస్పిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలతో నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్ పిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి) ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు ఈ అవార్డులను అందుకున్నారు. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటేట్ సెంటర్లో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 18వతేదీ వరకు 16వ ఇంధన సదస్సును నిర్వహించారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న నాణ్యమైన సేవలు, వినియోగదారుల సాధికారత అంశంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలోనూ, అలాగే సంస్థ పనితీరు మెరుగుదల అంశంలో కూడా జాతీయ స్థాయిలో ఎపిఎస్ పిడిసిఎల్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఈ సదస్సు తీర్మానించింది.

ఎలమంచిలి ప్రవీణ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

మెక్లారిన్ 176 వ జన్మదిన వేడుక సంద్భంగా ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్‌ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వించారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే దాదాపు నలుగురు పాస్టర్లకి రెవరెండ్ ఇవ్వడం జరిగింది. సుందర్రావు ,రెవరెండ్ ,యాకోబు, ఎవరం డేవిడ్, రెవరెండ్ ఈజ్కియా రాజు లకు బిషప్ హోదా ఇచ్చి ఆర్డినేషన్ చేశారు.



ఎస్వీయూలో గందరగోళంగా పీజీ కౌన్సిలింగ్

విద్యార్థులకు సమయం ఇవ్వని ఉన్నత విద్యా మండలి

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాల ఆధ్వర్యంలో పీజీ సెట్ కౌన్సిలింగ్ సర్టిఫికెట్ పరిశీలన గురువారం నుంచి ప్రారంభమైంది. విద్యార్థుల సర్టిఫికెట్ పరిశీలన కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి కనీస సదుపాయాలు గాని, సలహాలు, సూచనలు కానీ సరిగా ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్వీయూలో ఆర్ట్స్, సైన్స్, మేనేజ్మెంట్ కళాశాల ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా సైన్స్ కళాశాలలోని వివిధ కోర్సులలో చేరేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో సర్టిఫికెట్ పరిశీలనకు హాజరయ్యారు. సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో దాదాపుగా 20 కోర్సులకు పైగా విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవడానికి హాజరయ్యారు. అయితే సిబ్బంది కొరత, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థులకు తాగునీటి సదుపాయం కూడా కల్పించకపోవడం అలాగే సరైన సమాచారం అందించలేకపోవడం పెద్ద సంఖ్యలో వచ్చిన విద్యార్థుల సంఖ్యను క్రమ పద్ధతిలో పిలువకపోవడం కూడా అధికారుల వైఫల్యంగా కనిపించింది. ఉదయం 9:30 గంటలకు వచ్చిన విద్యార్థి సాయంత్రం ఏడు గంటల అవుతున్న కూడా సర్టిఫికెట్ పరిశీలన పూర్తి కాకపోవడంతో తీవ్ర నిరాశ నిర్వేదంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయం రేపటి వరకే ఉండటంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఉన్నత విద్య మండలి సైతం విద్యార్థులకు అర్ధరాత్రి సమయంలో సీట్ కేటాయించడం, సీట్ జాయినింగ్ రిపోర్టు కనీసం ఒక్కరోజు, రెండు రోజులు కూడా గడువు ఇవ్వకపోవడం పట్ల విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. విద్యార్థులు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి కనీసం వారం రోజులైనా సమయం ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు పెద్ద కమిటీ హాల్లో కానీ, శ్రీనివాస్ ఆడిటోరియంలో కానీ కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే విద్యార్థులకు అన్ని రకాలుగా అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండేదని విద్యార్థి సంఘాల నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ముందు సూచనతో సర్టిఫికెట్ పరిశీలన గడువును పొడిగించాలని, అలాగే సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ పూర్తిస్థాయిలో విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలనలో సమయాభావం లేకుండా చూసుకొని తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

క్యాంపస్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయంలో సుమారు పదివేల పుస్తకములు అందుబాటులో ఉన్నాయి. పెద్ద బాలశిక్ష, రామాయణం, మహాభారతం, విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించినటువంటి పుస్తకములు, ఎన్సైక్లోపీడియా, వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించినటువంటి పుస్తకములు పొందుపరచబడ్డాయని ప్రధానోపాధ్యాయులు షకీనమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా షకీనమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం వలన విద్యార్థులకు మేధో శక్తి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వి.రాజు, అరుణ, ప్రసాద్, హరి, విద్యార్థులు పాల్గొన్నారు.



గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ప్రియ

గుంతల రోడ్డుకు పరిష్కారం

సొంత నిధులతో మరమ్మతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మనసుంటే మార్గముంటుందంటారు పెద్దలు..ఆ మనసుతోటే మార్గం చూపే వాళ్లు కొందరే ఉంటారు. అలాంటి కోవకే చెందుతారు పట్టణంలోని వీఎంపల్లికి చెందిన యువతి పసల ప్రియా. ఏళ్ల తరబడీ గుంతలుగానే ఉన్న రోడ్డు, కళ్లెదుటే ఆ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్న జనాలను చూసి ఆమె చలించిపోయారు. తన సొంత నిధులుతో రాజీవ్ నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయించి శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి పోతే..వీఎంపల్లికి చెందిన ప్రియా రాజీవ్ నగర్ ప్రధాన రహదారి పక్కన ఓ చిన్న బట్టీకొట్టు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి రాజీవ్ నగర్‌కు వెళ్లే దారి గుంతల మయంగా ఉండటం, రాత్రిళ్లు స్థానికులు ప్రమాదాల బారిన పడటం చూసి ఆమె రోడ్డుకు మరమ్మతు చేయించాలనుకున్నారు. సొంత నిధులు వెచ్చించి గుంతలకు ఎర్రగుల్ల తోలించి అనుకున్నది పూర్తి చేశారు. అధికారులు చేయలేని పనిని ఓ యువతి ధైర్యంగా చేయడం చూసి రాజీవ్ నగర్ వాసులు ఆమె ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

అమ్మవారి సేవలో.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ప్రజాశక్తి-తిరుచానూరు : శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి అజయ్ రస్తోగో కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెంట్ మధుసూదన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వాదం మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

25 నుండి ఇంటర్ స్టేట్ క్యారమ్స్ పోటీలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఇంటర్ స్టేట్ క్యారమ్స్ పోటీలు ఈనెల 25 నుండి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పిఆర్‌క్లబ్ పాలకవర్గ సభ్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గూడూరు పట్టణంలోని పిఆర్‌క్లబ్ కార్యాలయంలో పాలక మండలి సభ్యులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పిఆర్‌క్లబ్ పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ పురుషులు, మహిళలు వేర్వేరు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ పోటీలను తిలకించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీరా రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామ్మోహన్రావు, వెంకటేశ్వర్లు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం



ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: ప్రతి ఒక్కరి జీవితంలో ఆర్థిక క్రమ శిక్షణ చాలా ముఖ్యమని ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ శివ కుమార్ అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక క్రమశిక్షణ, బ్యాంక్ లావాదేవీలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జగత్తుకు ఆధారమైందని సంపదేనని అన్నారు. అంతర్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ వ్యక్తిగత ఆర్థిక ప్రణాళిక వల్ల మంచి జీవితాన్ని నిర్మించుకోవచ్చని విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమ శిక్షణను అలవర్చుకోవడం మంచి అలవాటన్నారు. కళాశాల అధ్యాపకులు ఏ.దేవకి, వి.వాసవి, జి.తిరు మలయ్య, నీరజ., ఎం.శ్రీనివాసులు, మన్యం నరసింహులు, శ్రీనివాసులు, జ్యోతి, లక్ష్మి, సురేష్, బ్యాంకు సిబ్బంది, మోహన్, రాజేష్, రేవతి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గూడూరు రూరల్, గూడూరు: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతుకు జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వీధివిక్రయదారుల కార్మిక ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వీధి వ్యాపారస్తుల సమస్యలను తెలియచేశారు. సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్ ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి శశి కుమార్, ఏ ఐ టి యు సి నియోజకవర్గ కార్యదర్శి ఎం పేటి చంద్రయ్య, స్ట్రీట్ వండర్స్ నాయకులు శ్రీనివాసులు, సరిత పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

దాత బాలాజీకి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి -పిచ్చాటూరు: మండలంలోని 1996లో చదువుకున్న పూర్వ విద్యార్థుల చొరవతో జెడ్పీ పాఠశాల ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 40 మంది కళాశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. దాత బాలాజీకి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయుడు యుగంధర్ రాజు, వైసీపీ మండల అధ్యక్షుడు కేటి హరిచంద్ర రెడ్డి, స్థానిక సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, స్కూల్ పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ యోగ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాండియన్, విశ్వనాథ్, బాబు, రియాజ్, కిరుబ కరన్, విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన



ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఏయిడ్స్ కంట్రోల్ సొసైటీ, సార్ద్స్ గూడూరు ఆర్గనైజేషన్ వారి సహకారంతో కలజాత బృందం వారితో కలిసి శుక్రవారం గూడూరు మండలంలోని గాంధీ నగర్‌లో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సార్ద్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అంటూ వ్యాధి కాదని హెచ్ఐవి ఉన్నవారిని వివక్షకు గురి చేయ కూడదుని అలా చేస్తే చట్టరీత్యా నేరం అన్నారు. సార్ద్స్ సంస్థ మేనేజర్ ఓ.జయ చంద్ర తెలియ జేశారు. అనంతరం పాటలు పాడి అవగాహన కల్పించారు. సార్ద్స్ సంస్థ సభ్యులు, జాగృతి కళా బృంద సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని స్థానిక గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి 'చెకుముకి' సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల పరిధిలో 40 పాఠశాలల నుంచి సుమారు 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త చంద్రశేఖర్ హాజరై ప్రసంగించారు. సైన్స్ వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను వివరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ఎం షరీఫ్, చెంచయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రబాబు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం, మల్లవరం రసాయన శాస్త్రం ఉపాధ్యాయులు చిట్టిబాబు, గణిత శాస్త్రం ఉపాధ్యాయులు అల్లాబకష్‌లు చెకుముకి టాలెంటు టెస్టును ప్రారంభించారు. అనంతరం పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈపోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జెడ్పిపి పి బాలుర ఉన్నత పాఠశాల రేణిగుంట మొదటిస్థానంలో నిలిచారు. విద్యార్థులు టీమ్ పార్థసారథి, యోగేంద్ర సార్థెన్ పాల్గొన్నారు. అలాగే ప్రవేటు పాఠశాలల నుండి మొదటిస్థానం శ్రీవిద్యా కాన్వెంట్ విద్యార్థులు నిలిచారు. వారిలో మోహన కృష్ణ కుమార్, వంశీ, నందకిషోర్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను జిల్లాలో జరిగే పోటీ పరీక్షలకు పంపుతామని జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు సుభాషిణి, వరుణ్ కుమార్‌లు తెలిపారు. సునీత, అస్లాం, మురళిగోపి, రమణయ్య, ఫర్జాన అలాగే. విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ వెంకట రమణ పాల్గొన్నారు.





బిఎన్‌కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో జరిగింది. జే వి.వి అధ్యక్షులు జంగయ్య అధ్యక్షతన బిఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఎల్ విజయ్ కుమారి పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ పరీక్షలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు డయానా లక్ష్మి, కీర్తన, గీతిక, అలాగే ఎస్వీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు సంబంధించిన విద్యార్థులు ఆవుల పావని, పునుగొటి సంజన, సముద్రాల కీర్తి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అనంతరం వీరికి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు జై కృష్ణ, సురేష్ బాబు, శివ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే.. 'గడపగడపకు మన ప్రభుత్వం'

మంత్రి ఆర్.కె.రోజా



సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూసేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. శుక్రవారం పుత్తూరు మండలం తిరుమలకుప్పం సచివాలయం పరిధిలోని తిరుమలకుప్పం, ఎగువ తిరుమలకుప్పం, దిగువ తిరుమల కుప్పం, రాజుల కండ్రిక, ఎస్.టి. కాలనీ, తిరుమలకుప్పం ఎస్టీ కాలనీ, ఆది ఆంధ్రవాడ గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ, మునివేలమ్మ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు, రాష్ట్ర డైరెక్టర్లు, ఆలయ కమిటీ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేద ప్రజల జీవితాలతో వైసీపీ చెలగాటం

టీడీపీ నగరి ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్



మీకోసం తెలుగుదేశం కార్యక్రమంలో గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పేద ప్రజల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతుందని నగరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం కేబిఆర్‌పురం గ్రామంలో. మీ కోసం మీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్, మాజీ పరమేశ్వర మంగళం హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ మోహన్ రాజు, నగరి నియోజకవర్గ టీడీపి ఇన్‌చార్జ్ గాలి భాను ప్రకాష్, వెంకటరమణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత పెరిగిన నిత్యవసర సరుకులు వ్యత్యాసాన్ని వివరిస్తూ, ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి దోపిడి ప్రభుత్వానికి, అరాచక పరిపాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజల బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ సర్పంచ్లు మోహన్ రాజు, డి.వెంకటేశం చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి చినబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, వెంకటరమణ, మహేష్, కరుణ, చిట్టి, జయ చంద్ర నాయుడు, ఎన్. ఎన్ ధనపాల్, సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజి ధనపాల్. అయ్యప్ప రెడ్డి, మునికృష్ణయ్య, రామ్మూర్తి రెడ్డి నాయకులు కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర స్థలంలో రాజకీయ కలాపాలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పవిత్ర స్థలమైన నారద పుష్కరిణిలో వైసీపీ శ్రేణులు రాజకీయ కలాపాలు సాగించడం సిగ్గు చేటని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాలవిజయ్‌కుమార్‌నాయుడు విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పవిత్ర కోనేరును రాజకీయ వేదికగా వాడుకోవడం నేరమన్నారు. అందుకు అనుమతిచ్చిన ఆలయాధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తాము కేసు వేస్తామని హెచ్చరించారు. ఒక రాజధాని కట్టలేని వాడు..మూడు రాజధానులెలా కడతాడంటూ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎలాంటి సమాచారం లేకుండా డ్వాక్రా మహిళలను, విద్యార్థులను మూడు రాజధానుల మద్దతు కార్యక్రమంలో బలవంతంగా భాగస్వాముల్ని చేశాడంటూ మండిపడ్డారు. మిన్నల్ రవి, కంఠా రమేష్, గాలి మురళీనాయుడు, షాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వేడుకగా కార్తీక దీపోత్సవం


భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి టీటీడీ పరిపాలన భవనంలోని మైదానంలో కార్తీక మహా దీపోత్సవ కార్యక్రమం అత్యంత వేడుకగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని సామూహిక దీపారాధన చేశారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా శ్రీవారి తిరువారాధన నిర్వహించారు. పండితులు విష్ణుసహస్రనామం, శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామావళి స్తోత్రాలు పారాయణం చేశారు. ఆ తర్వాత అర్చక స్వాములు శ్రీమహాలక్ష్మి పూజ చేపట్టారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన దీపలక్ష్మి నమోస్తుతే నృత్య రూపకం భక్తులను ఆద్యంతం ఆకట్టుకుంది . భక్తులతో దీప మంత్రం 9 సార్లు పలికిస్తూ సామూహిక లక్ష్మీ నీరాజనం సమర్పించారు. చివరగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోవిందనామాలు పాడుతుండగా నక్షత్రహారతి, కుంభ హారతి సమర్పించారు. జేఈవో సదాభార్గవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి దంపతులు, ఎస్వీబిసి ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, జేఈవో వీరబ్రహ్మం , టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, మురం శెట్టి రాములు, మారుతి ప్రసాద్ , తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణ శేషాచల దీక్షితులు, సీవీఎస్వో నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ కుమారి అనుపమ అంజలి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈలు జగదీశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు, అర్చక బృందం, వేద పండితులతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

ప్రజాశక్తి-తిరుచానూరు: ముల్లోకాలను పాలించే నిండు ముత్తయిదువు పద్మావతమ్మ కార్తీక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి డిసెంబర్ 29 వరకు జరగనున్నాయి. ఆలయ మాడవీధుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారు ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై ఆశీనులై ఊరేగుతూ భక్తులకు దర్శన మివ్వనున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు అర్చకులు, వేద పండితులు లక్షమార్లు పటిస్తూ కుంకుమార్చన నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు అవరోధాలు లేకుండా సజావుగా జరగాలని ముందు రోజు సాయంత్రం శ్రీపాంచరాత్ర ఆగమ శాస్త్రియుక్తంగా ఆలయ అర్చకులు అంకురార్పణ చేపడతారు.



నాదెండ్లకు స్వాగతం పలికిన వినుత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికారు. నాదెండ్ల కడప పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా వినుత దంపతులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రాంత రాజకీయ పరిస్థితులను నాదెండ్లకు వివరించారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

గోశాలకు రూ.30 వేలు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల దేవస్థానానికి అనుబంధంగా నిర్వహిస్తున్న గోశాలకు నెల్లూరుకు చెందిన ఏవీ సుబ్బారావు కుటుంబం శుక్రవారం రూ.30 వేలు విరాళంగా అందజేసింది. దాతలు ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు అందజేసి గోవుల సంరక్షణకు ఖర్చు చేయాల్సిందిగా కోరారు. తదనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శనం కల్పించారు.



శ్మశాన స్థలం పరిశీలన

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని తడుకు పంచాయతీలోని ఎగువగుళూరులో సిరుగురాజు పాలెం లెక్కదాకలోని 89 సర్వే నంబర్లు గల శ్మశానం కబ్జాకు గురైంది. గత బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎదురుగా ధర్నా చేశారు. దానికి స్పందించిన తహశీల్దార్ శుక్రవారం పుత్తూరు మండల సర్వే వీఆర్వోను ఆ స్థలానికి పంపించి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. స్పందించిన న్యాయం చేసిన రెవెన్యూ శాఖకు ఎగువ గూళూరు గ్రామ ప్రజలు, కెవిపిఎస్ నాయకులు కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. వై.నందయ్య, మన్నారు శివయ్య, రామ్మూర్తి, చిట్టిబాబు, రామయ్య గోపాల్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- రేణిగుంట : మండలంలోని విప్పమానపట్టెడ గ్రామపంచాయతీ ఎస్టీ కాలనీలో శుక్రవారం మృతి చెందిన సుబ్రహ్మణ్యం పార్థివ దేహానికి సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతి చెందిన వ్యక్తికి వైఎస్ఆర్ బీమా అర్హత కలిగి ఉండడంతో లక్ష రూపాయల భీమాలో దహన సంస్కారాలు గాను రూ.పదివేలు నగదును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు. రాయల చెరువు పార్థు కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఆర్‌డి సుబ్రహ్మణ్యం రెడ్డి దాతృత్వంతో మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు.

ప్రజల వద్దకే మెరుగైన వైద్య సేవలు : డాక్టర్ చైతన్య

ప్రజాశక్తి- దొరవారిసత్రం: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విలేజ్ వైద్యం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వైద్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం దొరవారిసత్రం మండల పరిధిలోని ఏ కోళ్ళ గ్రామంలో విలేజ్ వైద్యం 104 వైద్య సేవలను అందించారు. గ్రామంలో అంటు రహిత వ్యాధిగ్రస్తులైన బిపి, షుగర్, థైరాయిడ్, మొదలగు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా సాధారణ చర్మ వ్యాధిగ్రస్తులను వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం శారీరక పరిశుభ్రత, దోమలు ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 104 వైద్యులు కిషోర్, ఏఎన్ఎం దొరతి, శ్రావణి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఆరోగ్య కార్యకర్త సుధాకర్, రత్నయ్య, ఆశ వర్కర్లు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడిపై అవగాహన

ప్రజాశక్తి-గూడూరు : పట్టణంలోని సబ్ డివిజన్ స్థాయి వ్యవసాయ సిబ్బందికి డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు టెక్నికల్ వ్యవసాయ అధికారి చెంచు రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ వాసుదేవ రెడ్డి, ప్రగతి ట్రస్ట్ నుంచి సురేష్ హాజరై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ పొలం బడి కార్యక్రమం ఎలా నిర్వహించాలి, ముఖ్య ఉద్దేశ్యం గురించి విపులంగా వివరించారు. వరిలో విత్తన శుద్ధి, మొలకశాతం, ఆరోగ్యవంతమైన నారు మడి పెంపకంలో జాగ్రత్తలు గురించి తెలియజేసారు. వరిలో వివిధ దశలలో వాడవలసిన ఎరువుల మోతాదుల గురించి, చీడ పీడల గుర్తింపు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం అందరూ పొలం పరిశీలన చేసి గుర్తించిన అంశాలను చార్టుల రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు, ఓజిలి మండలాల వ్యవసాయ అధికారులు జి.భవాని , విజయలక్ష్మి, ఉద్యాన అధికారి కార్తీక్ వ్యవసాయ/ఉద్యాన అధికారి సిబ్బంది పాల్గొన్నారు..

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తూకివాకం సర్పంచ్ సిద్ధప్ప రెడ్డి మునిశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - రేణిగుంట : రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తూకివాకం సర్పంచ్ సిద్ధప్ప రెడ్డి మునిశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తూకివాకం పంచాయతీ హరిజనవాడలో ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఆయన పరిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఇక్కడ వర్షం పడిందంటే రోడ్డుపైకి మురుగునీళ్లు వచ్చి అక్కడ ఉన్న స్థానికులు తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ ఉన్నారని అన్నారు. దీంతో వెంటనే ఈ సమస్య పరిష్కారానికి ఇక్కడ డ్రైన్ సమస్య పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తమ పంచాయతీలో ఎక్కడా సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని అన్నారు. తుకివాకం హరిజనవాడ స్థానికులు ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, పంచాయతీ కార్మికులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు

వైభవంగా కార్తీక వనభోజన మహోత్సవం

ప్రజాశక్తి-కోట : పట్టణంలోని శ్రీశ్రీ కోటమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణంలో వెలసియున్న శ్రీ భవానీ శంఖర స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం శ్రీశుభకృత్ నామ సంవత్సర కార్తీక మాసం బహుళ దశమి సందర్భంగా దాతల దాతృత్వంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పూజాకార్యక్రమాలు, వన భోజన కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్త జన సమూహం భారీగా తరలివచ్చి వనభోజన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు, రుచికరమైన అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కోటమ్మ తల్లి దేవస్థానం ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కవిత దంపతులు, నల్లప రెడ్డి వినోద్ రెడ్డి, శ్రీ షిరిడి సాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, నాగలపురం గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం మరో జ్ఞానం

ప్రజాశక్తి -బాలాయపల్లి: విద్యార్థులకు పుస్తకాలు మరో జ్ఞానం లాంటివని మండల పరిషత్ అధికారి వినీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పుస్తక జ్ఞానం జీవనశైలి విధానాన్ని మార్పు చేస్తుందన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి కథల పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. చదువు మరో జ్ఞానమని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రచయిత్రి ఉషారాణికి అభినందనల వెల్లువ



చిన్నగొట్టిగల్లు : స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులురాలు ధనాశి ఉషారాణికి అభినందనలు వెల్లువెత్తాయి. అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో గౌరవ అతిథిగా పాల్గొని గ్రంథాలయాల విశిష్టత గురించి కవితాగానవం నిర్వహించారు. తాను రచించిన పలు పుస్తకాలను గ్రంథాలయానికి అందజేయడంతో వారు శాలువా మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అలాగే తిరుపతి గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని కవిసమ్మేళనం నిర్వహించడం, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి చేత అమె రచించిన రాఘజరి పుస్తకం ఆవిష్కరణ, ఆమె రచనల్లోవివిధ ప్రక్రియలు రూపొందించినందుకు అభినందనలు తెలియజేసారు.